గ్రావ్టన్ మోటార్స్ అవుట్ లెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



గ్రావ్టన్ మోటార్ బైక్ కీని వినియోగదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

విద్యానగర్, జనవరి 5: హైదరాబాద్‌కు చెందిన పుల్-స్టాక్ ఈవీ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ, సుస్థిర మొబిలిటీలో అగ్రగామి అయిన గ్రావ్టన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన తన మొదటి కంపెనీ యాజమాన్యం లోని అవుట్ లెట్‌ను ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ నేడు ఆవిష్కరణలకు, సుస్థిరతకు కేంద్రంగా గర్వంగా నిలుస్తున్నదన్నారు. అంకితభావం, పట్టుదల పరివర్తనాత్మక పురోగతికి ఎలా దోహదపడుతుందో గ్రావ్టన్ మోటార్స్ కృషి ఉదాహరణగా నిలుస్తున్నదని, ఈ విజయానికి గానూ సీఈవో పరశురామ్, ఆయన బృందాన్ని అభినందించారు. గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు, సీఈవో పరశురామ్.. గ్రావ్టన్ ప్రధాన ఉత్పాదన అయిన క్వాంటా ప్రత్యేకతలను వివరించారు. దీనిపై కేవలం రూ.20 నుంచి రూ.30 ఖర్చుతో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం తన చిన్ననాటి ఉపాధ్యాయుడికి మొదటి రిజిస్టర్డ్ గ్రావ్టన్ క్వాంటా ఈవీ మోటార్ సైకిల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, షోరూం నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలి

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 5: చైతన్య యూత్ క్లబ్ ద్వారా పేదలను ఆదుకునేలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని క్లబ్ నూతన అధ్యక్షుడు మేయర్ యాదగిరి సునీల్ రావు సభ్యులకు సూచించారు. కరీంనగర్‌లోని 33వ డివిజన్ భగత్ నగర్‌లో ఆదివారం నిర్వహించిన చైతన్య యూత్ క్లబ్ సర్వసభ్య సమావేశానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సేవాకార్యక్రమాలతో భగత్ నగర్ చైతన్య యూత్ క్లబ్ ఆదర్శంగా నిలువాలన్నారు. అనంతరం అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా మేయర్ యాదగిరి సునీల్ రావుతో పాటు ఇతర కార్యవర్గాన్ని నియమించారు. క్లబ్ స్థాపించిన పలువురు సభ్యులను మేయర్ సత్కరించారు. సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశ పెట్టి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బహుమతులు అందజేస్తున్న సిగ్మా శ్రీరాం, తదితరులు

కమాన్‌చౌరస్తా, జనవరి 5 : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత ప్రతిభను వెలికి తీయడానికి కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు లెవెల్ -1పరీక్షను వారి పాఠశాలల్లో డిసెంబర్ 2 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించారు. 14,445 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు డిసెంబర్ 22, 29న లెవల్-2 పరీక్ష నిర్వహించారు. దీనికి 3,389 మంది విద్యార్థులు హాజరై అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఇందులో ఎంపిక చేసిన పలువురు విద్యార్థులకు వావిలాలపల్లిలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ సీనియర్ లెక్చరర్ సిగ్మా శ్రీరాములు, కెమిస్ట్రీ లెక్చరర్ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు.

ముగ్గురి ప్రాణాలు తీసిన ప్రమాదం

- చికిత్స పొందుతూ మూడో వ్యక్తి మృతి

మాశెట్టి అశోక్(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 5: మండలంలోని మహాత్మానగర్‌లో రెండు కుటుంబాలకు చెందిన నలుగురు ఇటీవల వేములవాడ రాజన్న దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఇందులో పొలవేణి మంగ అక్కడికక్కడే మరణించగా.. ఆమె భర్త గట్టుబాబు చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. అలాగే తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మాశెట్టి అశోక్(60) సైతం ఆదివారం ఉదయం మరణించాడు. తీవ్రంగా గాయపడిన అశోక్ భార్య దవాఖానలో చికిత్స పొందుతున్నది. ప్రమాదంలో ఒకరితర్వాత ఒకరు వరుసగా ముగ్గురు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అశోక్ కుటుంబాన్ని స్థానిక నాయకులు పరామర్శించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

జమ్మికుంట, జనవరి 5: పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెండ్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె రాజయ్య, మున్సిపల్ పరిధిలోని మారుతీనగర్‌కు చెందిన గుడికందుల సంపత్ ఇంటి నిర్మాణాలకు సంబంధించిన కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం పనులకు మోపెడ్‌పై వెళ్తున్నారు. ఆదిత్య బార్ అండ్ రెస్టారెండ్ దగ్గర రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపునకు వస్తున్న ఇన్నోవా కారు వేగంగా ఢీకొన్నది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ ఎగిరి పడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో సిబ్బంది వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, సంపత్(52) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజయ్య పరిస్థితి విషమంగా ఉంది. మృతుడికి భార్య నిర్మల, కొడుకు, ఇద్దరు కూతుళ్లున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ దవాఖాన వైద్యురాలిదని తెలిసింది. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అయితే, జరిగిన ప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పట్టణ సీఐ వీ రవి చెప్పారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

హుజూరాబాద్ టౌన్, జనవరి 5: హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామ శివారులోని జూపాక క్రాస్ రోడ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజుల ఓదమ్మ(68) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... శంకరపట్నం మండలం కల్వల గ్రామానికి చెందిన ఓదమ్మ, శనివారం జూపాక గ్రామంలో తన బంధువు మృతిచెందగా అంత్యక్రియలకు వెళ్లి, తిరిగి ఇంటికి బయలుదేరింది. జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై జూపాక క్రాస్ రోడ్ వద్ద నిల్చొని ఉండగా జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వేగంగా వస్తున్న కారు(ఏపీ 20 క్యూ7299) ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను 108లో హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ సూచన మేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదమ్మ మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఖాజా కలీముల్లాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 5: తాడికల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. అదే గ్రామానికి చెందిన వొడ్నాల వీరయ్య ఇంటి నుంచి టీ తాగడానికి బయటికి నడుచుకుంటూ వస్తూ ప్రధాన రహదారి క్రాస్ చేస్తుండగా, బెల్లంపల్లి నుంచి వస్తున్న ఓ బైకిస్ట్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వీరయ్యకు గాయాయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ దవాఖానకు తరలించారు.

జిల్లా విద్యాశాఖ తీరుతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం

మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్ సింగ్

- సర్కారు ప్రైవేట్ స్కూళ్లతో ఎంవోయూ చేసుకోవడమేమిటి?
- ఇది ప్రభుత్వ ఉపాధ్యాయులను అవమానపర్చడమే
- విలేకరుల సమావేశంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, జనవరి 5: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా విద్యా శాఖ వ్యవహరిస్తున్నదని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ విమర్శించారు. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు జిల్లాలో ప్రైవేటు పాఠశాలలతో ఎంవోయూ చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల టీచర్ల బహిరంగ సభలో ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అన్ని క్వాలిఫికేషన్స్ ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తున్నారని చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతుండగా, జిల్లాలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్దన్ రావు మాత్రం ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల అల్ఫోర్స్ పాఠశాలలో జరిగిన ఒలింపియాడ్ శిక్షణ తరగతులకు డీఈవో హాజరై ప్రైవేట్ శిక్షణ తరగతులను ప్రోత్సహించారని ఆరోపించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ప్రభుత్వం తన దగ్గరికి వస్తున్నదని కార్యక్రమ ఫొటోలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. అల్ఫోర్స్ కాలేజీ ఒలింపియాడ్ శిక్షణ తరగతులకు హాజరుకాని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు డీఈవో ఎలా నోటీసులు జారీ చేస్తారని ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి విద్యాసంస్థలకు వెళ్లి కలెక్టర్, డీఈవో ప్రోగ్రామ్స్ నిర్వహించడం సరికాదన్నారు. జిల్లా విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలతో రానున్న రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను నమ్మే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న కలెక్టర్, డీఈవోపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మంచి సామర్థ్యంతో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసి, నామమాత్రంగా శిక్షణ ఇచ్చి వారిని తామే తీర్చిదిద్దామని ప్రైవేట్ స్కూల్స్ ప్రచారం చేసుకుంటున్నాయని విమర్శించారు. ఒకరకంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రైవేట్ స్కూళ్ల ప్రచారానికి ఉపయోగపడుతున్నదన్నారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులు సరైన చదువు చెప్పడం లేదన్నట్లు అవమాన పరచడమే అవుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా అన్ని క్వాలిఫికేషన్స్ ఉండి బోధించే ప్రభుత్వ ఉపాధ్యాయుల కన్నా ప్రైవేటు ఉపాధ్యాయులు ఏ రకంగా మేలో జిల్లా అధికారులే చెప్పాలన్నారు. ఈ సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరిక కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి, జనవరి 5: హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లా పెరిక కుల సంఘం నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను ఆదివారం సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, పెరిక కులస్తులు మాట ఇస్తే తప్పరని, ఎంతో చైతన్యం కలిగిన వారని కొనియాడారు. తనకు పెరిక కులస్తుల్లో చాలా మంది ఆప్తులు ఉన్నారని, వారితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కుల సంఘం భవన నిర్మాణానికి కరీంనగర్‌లో స్థలం కేటాయించాలని మంత్రికి సంఘ నాయకులు వినతి పత్రం ఇవ్వగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బస్వ వెంకన్న, మాజీ సర్పంచ్ బోళ్ల మురళీధర్, డాక్టర్ పోతురాజు శ్రీనివాస్, మీస రమేశ్, సాయిరి దేవయ్య, పోతరాజు రాములు, పోతరాజు వెంకన్న, పోతరాజు రాజయ్య, పెట్టెం సంపత్, గాండ్ల అంజన్న, తిప్పని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

వీణవంక, జనవరి 5: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చల్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి వాహనదారులకు ఎస్ఐ తోట తిరుపతి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుకూడదని సూచించారు. అతివేగం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, వేగాన్ని తగ్గించి సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాతో పాటు జైలు శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు వాహనదారులు పాల్గొన్నారు.

విరాళాలతో అంత్యక్రియలు

వీణవంక, జనవరి 5: చల్లూరు గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు చెల్పూరి లక్ష్మి (75) మృతిచెందగా, మల్లారెడ్డిపల్లికి చెందిన అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరాళాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, సభ్యులు గడ్డం కుమారస్వామి, తాండ్ర లక్ష్మణ్, ఎలబాక నరేశ్, పరిపూర్ణాచారి, మొగిలి, ప్రకాశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గంగాధర, జనవరి 5: బూరుగుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కారుపాకలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మొగిల్ల రమేశ్ ఇటీవల మృతి చెందగా, ఆదివారం గంగాధర ఆటో యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ.5 వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ యూనియన్ అధ్యక్షుడు గంగాధర పరశురాములు, సభ్యులు బత్తిని శ్రీనివాస్, సుద్దాల అశోక్, బండారి మల్లేశం, ఒల్లాల లచ్చయ్య, రవి, శ్రీను, తిరుపతి, ఆంజనేయులు, చందు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు లక్ష డప్పులతో కవాతు

మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్, నాయకులు

చిగురుమామిడి, జనవరి 5: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలతో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో కవాతు చేపడుతున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్ మాదిగ తెలిపారు. చిగురుమామిడి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రవ్యాప్తంగా అనేక కుల సంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నప్పటికీ కొందరు వ్యతిరేకిస్తూ అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. వారు ఎవరైనా మనువాదులేనని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానిలో జరిగే కవాతుకు మాదిగ డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలుపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, నాయకులు నారాయణ, సమ్మన్న, వరలక్ష్మి, ఆది మల్లయ్య, శ్రీనివాస్, నాంపల్లి, సంపత్, రమేశ్, తిరుపతి, అశోక్, సదానందం, కుమారస్వామి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, జనవరి 5: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మాదిగ కళామండలి జిల్లా నూతన అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, నూతన ఉపాధ్యక్షుడు అందాసి నారాయణను ఆదివారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగల మహా ప్రదర్శనకు జిల్లా నుంచి వేల సంఖ్యలో మాదిగ డప్పు కళాకారులు, గాయకులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం, జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ల శేఖర్, రిటైర్డ్ హెడ్ పోస్ట్ మాస్టర్ ఇల్లందుల సమ్మయ్య, సీనియర్ గాయకుడు మిడిదొడ్డి రాజయ్య, రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వేల్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

చిగురుమామిడి, జనవరి 5: నవాబ్ పేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి గుండెపోటుతో ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, నవాబ్‌పేట గ్రామాధ్యక్షుడు పిల్లి వేణు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు అనుమాండ్ల సత్యనారాయణ, మాజీ మండలాధ్యక్షులు కూతురు శరభంద రెడ్డి, రామోజు కృష్ణమాచారి, గ్రామాధ్యక్షులు ఆకవరం శివ ప్రసాద్, ఎస్‌కే సిరాజ్, బోయిని రమేశ్, మాజీ సర్పంచులు జక్కుల రవి, బోయిని శ్రీనివాస్, సన్నిల్ల వెంకటేశం, మండల నాయకులు పెనుకుల తిరుపతి, పెద్దపల్లి అరుణ్ కుమార్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మంకు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ తనవంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఇసుక మట్టిపాలు!

తహసీల్ కార్యాలయం వెనుక మట్టిలో కలుస్తున్న ఇసుక

గంగాధర మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వెనుక ఇసుక మట్టి పాలవుతున్నది. మండలంలో పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోగా, తహసీల్ కార్యాలయం వెనుక ఇసుకను డంప్ చేశారు. కాగా, ఏండ్లు గడుస్తున్నా వేలం వేయకపోవడంతో ఇసుక మట్టిలో కలుస్తున్నది. ఇసుక వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా, నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల తీరుపై మండల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

-గంగాధర, జనవరి 5

జిల్లా వాసులకు పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, జనవరి 5 : కరీంనగర్ జిల్లాకు చెందిన యువ కవి, రచయిత మెరుగు ప్రవీణ్‌కు పండుగ సాయన్న స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సాయన్న రాష్ట్ర స్థాయి సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు సాహితీ సృజనకారులు, సేవా సంస్థల బాధ్యులు మెరుగు ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.

హుజూరాబాద్ టౌన్, జనవరి 5: చెల్పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు ఆకినపల్లి శిరీష ఉత్తమ సామాజిక మహిళా అవార్డును అందుకున్నారు. పండుగ సాయన్న 150వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆమెకు అవార్డు అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, జర్నలిస్ట్ మహిపాల్ యాదవ్, ఆర్గనైజర్లు మహేశ్, ఆశప్రియ, రమేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గంగాధర, జనవరి 5: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామ పంచాయతీ ఆవరణలో కరీంనగర్ సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు 200 మందికి కీళ్ల నొప్పులు, మెడ నొప్పులు, కీళ్ల వాతం, పోలియో, తొంటి నొప్పులు, ఫ్యాక్షర్లు, వంకర కాళ్లు, సయాటికా, స్పాడిలైటీస్ సమస్యలకు డాక్టర్ చొక్కారపు రాము పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాము, కమలాకర్, హరి, హాస్పిటల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరణానంతరం దేహదానానికి వీలునామా పత్రం అందజేత



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సమక్షంలో వీలునామా పత్రాన్ని అందజేస్తున్న సంపత్

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ కాపువాడకు చెందిన కరబత్తుల సంపత్ కుమార్ తన మరణానంతరం వైద్య విద్యార్థుల కోసం దేహదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ సమక్షంలో రేకుర్తిలోని డాక్టర్ మాడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార కంటి దవాఖాన ట్రస్టు సభ్యులకు వీలునామా పత్రాన్ని అందజేశారు. సంపత్ నిర్ణయాన్ని పలువురు అభినందించారు.

బొమ్మకల్‌లో మున్నూర్ కాపు ఆత్మీయ సమ్మేళనం

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బట్టు సత్యనారాయణ తదితరులు

కరీంనగర్ రూరల్, జనవరి 5: బొమ్మకల్‌లో పటేల్ మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మున్నూర్ కాపు పటేల్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఈవీ వేణుగోపాల్, విశిష్ట అతిథిగా కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బట్టు సత్యనారాయణ హాజరయ్యారు. నూతన సంవత్సరం 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూర్ కాపు సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, బొమ్మకల్ గ్రామ ప్రతినిధులతో పాటు పటేల్ మిత్ర సంఘం గ్రామాధ్యక్షుడు పోగుల ఆంజనేయులు పటేల్, గౌరవాధ్యక్షుడు అకిరెడ్డి యాదగిరి పటేల్, ప్రధాన కార్యదర్శి నాయిని సంపత్ కుమార్‌పటేల్, నాడేం భూమయ్యపటేల్, సంఘం ముఖ్య సలహాదారు పురుమల్ల శ్రీనివాస్, పటేల్, అకిరెడ్డి తిరుపతి పటేల్, చింతల కిషన్ పటేల్, చెట్టి జగన్ పటేల్, దాది సుధాకర్‌పటేల్, చిందం మల్లయ్యపటేల్, ఎడ్ల ఆంజనేయులు పటేల్, తోట కిరణ్‌పటేల్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బీసీ సంఘం నాయకులు

తెలంగాణచౌక్, జనవరి 5: రాష్ట్ర హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్‌ను బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మహేందర్ నగరంలో ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో జర్నలిస్టులకు స్థలాలు: ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 5: ప్రజల కోసం పని చేసే జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీతో పాటూ అర్హులై